

నేడు పాడేరులో స్పందన కార్యక్రమం

» కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడి

పాడేరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీ ప్రాంత ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాలన్నారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పాడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, కీలకమైన గ్రామాల్లో సైతం ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాడేరులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పాలు, రొట్టెలను పంచిపెట్టారు. అరకులోయలో పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అరకులోయలో ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.



పాడేరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గిడ్డి ఈశ్వరి, తదితరులు

అదే పోరు.. అదే జోరు



చింతపల్లిలో మోకాళ్లపై నిల్చొని సంఘీభావం తెలుపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరింది. జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగా, చింతపల్లిలోని శిబిరంలో మోకాళ్లపై నిల్చొని సంఘీభావం తెలుపుతూ అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు.

-వార్త 8వ పేజీలో..

ప్రగతి లేని పల్లెలెన్నో!

మన్యంలో ఇప్పటికీ అభివృద్ధికి నోచని వందల గ్రామాలు

వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేని వందల పల్లెలు

ప్రభుత్వ ప్రకటనకు, వాస్తవ పరిస్థితికి కుదరని పొంతన

పంచాయతీ కేంద్రాల్లోనూ కానరాని సంపూర్ణ అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ప్రతి పల్లెలో ప్రగతి బాటలు వేశామని వైసీపీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. అయితే ఏజెన్సీలోని పలు గ్రామాలను చూస్తే అభివృద్ధి జాడే కనిపించడం లేదు. మన్యంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు సంపూర్ణంగా నిర్మించిన దాఖలాలు లేవు. ఇక గ్రామాల్లో రోడ్లు, రవాణా, తాగునీరు, విద్య, వైద్య సేవలు ఘోరంగా ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వైసీపీ పాలనలో అరకొరగా అందే నవరత్నాల పథకాలు మినహా పక్కా ఇళ్లు సైతం గిరిజనులకు అందని దుస్థితి నెలకొంది. ఏజెన్సీ 11 మండలాల్లోని 244 గ్రామ పంచాయతీల పరిధిలో 212 గ్రామ సచివాలయాల్లో 3,915 గిరిజన పల్లెల్లో ఏడు లక్షల మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. కానీ ఇప్పటికీ సగానికి పైగా పల్లెలకు పక్కా రోడ్డు లేకపోవడంతో వందల సంఖ్యలో గిరిజన పల్లెలు అభివృద్ధి, సంక్షేమానికి దూరంగా ఉన్నాయి. దీంతో ఆయా పల్లెల్లోని గిరిజనుల జీవనంలో ఎటువంటి మార్పులు కనిపించడం లేదు. ఏజెన్సీలో మారుమూల పల్లెలు అధికంగా ఉన్న ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో వందలాది గ్రామాలకు చెందిన ఆదివాసులు ఇప్పటికీ గుర్రాలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. గుర్రాలను కొనుక్కోలేని పేద గిరిజనులు కాలినడకనే తమ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏజెన్సీలో మండల కేంద్రాలు, కాస్త రోడ్డు పక్కన గ్రామాలకు మాత్రమే రోడ్డు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

అభివృద్ధి అంతంత మాత్రమే..

వైసీపీ పాలనలో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి సంగతి అటుంచితే, కనీసం పంచాయతీ కేంద్రాలు సైతం సంపూర్ణ అభివృద్ధికి నోచుకోలేదు. ఏజెన్సీ వ్యాప్తంగా 244 గ్రామ పంచాయతీలుండగా ఇప్పటికీ సగానికి పైగా పంచాయతీలకు రోడ్డు వంటి కనీస సదుపాయాలు లేని పరిస్థితి కొనసాగుతున్నది. వాస్తవానికి గిరిజన ప్రాంతానికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధుల విడుదలతో ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన పథకంలో కొంత వరకు మారుమూల పల్లెలకు తారురోడ్డు సౌకర్యం కలుగుతున్నది. అదే పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడితే ఏజెన్సీలో జనమంతా గుర్రాలపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి కొనసాగేది.



పెదబయలు మండలం అరడకోటలో రెండేళ్లుగా అసంపూర్తిగా వున్న గ్రామ సచివాలయ భవనం

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలకే దిక్కులేదు

ఏజెన్సీలో గ్రామాల అభివృద్ధిని పక్కన పెడితే వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతగా భావించే ప్రభుత్వ భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ల భవనాలే గత నాలుగేళ్లలో పూర్తికాని దుస్థితి కొనసాగుతున్నది. ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల పరిధిలో 212 గ్రామ సచివాలయాలకు గానూ ఇప్పటికీ కేవలం 55 సచివాలయాలకు చెందిన భవనాలు మాత్రమే పూర్తికాగా, 157 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతగా భావించే సచివాలయ భవనాల పరిస్థితే ఇలా ఉందంటే ఇక ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ సెంటర్ల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దీంతో ఇప్పటికీ వందకు పైబడి సచివాలయాలు ఇతర భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో పల్లె ప్రగతి సంగతి దేవుడెరుగు, ప్రభుత్వానికి సంబంధించి వసతి సదుపాయాలే మెరుగుపడని పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను విస్మరించి తమ పాలనలో గ్రామాలు సైతం ఎంతో అభివృద్ధి చెందాయని వైసీపీ ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం నేతి బీరకాయలో నెయ్యి చందంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.



హుకుంపేట మండలం సంతారిలో అద్దె భవనంలో గ్రామ సచివాలయం



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

చంద్రబాబు సభకు చకచకా ఏర్పాట్లు

శరవేగంగా పనులు

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు

అరకులోయ, జనవరి 18: అరకుకు సమీపంలో జైపూర్ జంక్షన్ వద్ద ఈ నెల 20న నిర్వహించనున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బహిరంగ సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న చంద్రబాబు ఏజెన్సీకి వస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం ఉదయం సీఐ రుద్రశేఖర్, స్థానిక ఎస్‌ఐలు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్ కూడా పరిశీలన జరిపారు.

సభ ఏర్పాట్లు, తదితర వివరాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అరకు అసెంబ్లీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావును అడిగి తెలుసుకున్నారు. కాగా సభా వేదిక, బారికేడ్లు, హెలీప్యాడ్ పనులు, పార్కింగ్‌కు స్థలం తదితర ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. దువ్వారపు రామారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్, అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి దొన్నుదొర పనులను పర్యవేక్షించారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పార్టీ నాయకులు పనుల్లో నిమగ్నమయ్యారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దువ్వారపు రామారావు, శ్రావణ్‌కుమార్, దొన్నుదొర, తదితరులు

చంద్రబాబు రాక రేపు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన శనివారం ఉదయం 9.45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో 10.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.35 గంటలకు అరకులోయ చేరుకుంటారు. బహిరంగసభ ముగిసిన తరువాత మధ్యాహ్నం 1.40 గంటలకు అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోనసీమ జిల్లా మండపేట వెళతారు.



కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం గ్రామంలో గత ఆరు నెలలుగా చెత్త నడుమ ఉన్న అంబేడ్కర్ విగ్రహం

నిర్లక్ష్యం నీడన అంబేడ్కర్ విగ్రహం

విగ్రహం పాక్షికంగా ధ్వంసమై నేలకూలి

ఆరు నెలలైనా పట్టించుకోని పాలకులు

కొయ్యూరు, జనవరి 18: మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో బూదరాళ్ళ కూడలి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నిరాదరణకు గురై చెత్త మధ్య ఉంది. బూదరాళ్ళ కూడలి వద్ద బస్‌షెల్టర్‌కు చేరువలో అల్లూరి సీతారామరాజు విగ్రహం పక్కనే ఐదేళ్ల క్రితం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేశారు. ఆరు నెలల కిందట ఈదురుగాలులకు సమీపంలో ఉన్న చింతచెట్టు కొమ్మ విరిగి అంబేడ్కర్ విగ్రహంపై పడింది. దీంతో విగ్రహం పాక్షికంగా ధ్వంసమై నేలకూలింది. నాటి నుంచి నేటి వరకు ఈ విగ్రహాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో తుప్పల మధ్య దుమ్ము పట్టి అలాగే ఉండిపోయింది.



బూదరాళ్ల కూడలి వద్ద చింతచెట్టు పడి ధ్వంసమైన దిమ్మ... నేలపై అంబేడ్కర్ విగ్రహం

మళ్లీ పెరిగిన చలి




చింతపల్లిలో మంచు

జి.మాడుగులలో 7.4, జీకేవీధిలో 9.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత, పొగమంచు తగ్గడం లేదు. అలాగే కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. గురువారం జి.మాడుగులలో 7.4, జీకేవీధిలో 9.3, చింతపల్లిలో 12.5, అరకులోయలో 12.7, పాడేరులో 12.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం వేళల్లో పొగ మంచు దట్టంగానే కమ్ముకుంటున్నది. దీంతో ఎదురుగా వున్న వ్యక్తులు సైతం కనిపించని విధంగా ఉండడంతో వాహనాలు హెడ్ లైట్లు, ఫాగ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక మోస్తరుగా ఎండ ప్రభావం ఉండగా, మిగిలిన సమయంలో చలి ప్రభావం కొనసాగుతున్నది. దీంతో చలి మంటలు వేసుకుంటూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ మన్యం వాసులు చలి నుంచి రక్షణ పొందుతున్నారు.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గురువారం జీకే వీధిలో 9.3, చింతపల్లిలో 12.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం చింతపల్లిలో 16 డిగ్రీలు నమోదుకాగా, ఒక్కరోజులోనే 3.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత పడిపోయింది. దీంతో ఒక్కసారిగా చలి ఉధృతి పెరిగింది. చలితో పాటు మంచు అధికంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు లంబసింగి, తాజంగి, చింతపల్లి, జీకే వీధి, ఆర్‌వీ నగర్ ప్రాంతాల్లో మంచు వీడడం లేదు. ఉదయం వేళల్లో స్థానిక ప్రజలు మంచు, చలిలోనే వారి దినచర్యను ప్రారంభిస్తున్నారు. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నపిల్లలు మరింతగా ఇబ్బంది పడుతున్నారు.



పాడేరులో గురువారం ఉదయం దట్టంగా పొగమంచు



మంచు మేఘాల కనువిందు

పర్యాటకులతో వంజంగి మేఘాల కొండ కిటకిట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగి మేఘాల కొండకు పర్యాటకులు గురువారం పోటెత్తారు. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బుధవారం రాత్రే పాడేరు చేరుకున్నారు. గురువారం వేకువజామున వంజంగి కొండకు వచ్చి మంచు మేఘాల అందాలను ఆస్వాదించారు.

-పాడేరు రూరల్



క్రైం... crime news

ఏలేరు కాలువలో గుర్తుతెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్, జనవరి 18: సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట వద్ద ఏలేరు కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం బయటపడింది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని పట్టణ ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. ఆరెంజ్ కలర్ చొక్కా, బ్లాక్ కలర్ డ్రాయర్ శరీరంపై ఉన్నాయని ఆయన తెలిపారు. ఎవరికైనా మృతుడు వివరాలు తెలిసినచో టౌన్ సీఐ సెల్ నంబరు 9490737758, టౌన్ పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూమ్ నంబరు 9154879719లకు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ సింహాచలం కోరారు.

బస్సు ఢీకొని కృష్ణా జిల్లా వాసి మృతి


క్రాంతికిరణ్ (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, జనవరి 18: మండలంలోని గోకులపాడు వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గోకులపాడు వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు నుంచి విజయవాడ వెళుతున్న బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే దుర్మణం చెందాడు. మృతి చెందిన వ్యక్తి దగ్గర ఉన్న బ్యాగులో గల ఆధార్ ఆధారంగా మృతుడు కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన వి.క్రాంతికిరణ్‌గా (57)గా గుర్తించారు. అతడి బ్యాగ్‌లో బట్టలు, ఆధార్‌కార్డు తప్ప ఇంకేమిలేవని, క్రాంతికిరణ్ ఎవరన్నది తెలియాల్సి ఉందని ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి మార్చ్యూరీలో భద్రపరిచినట్టు చెప్పారు.

అన్నవరం తీర్థంలో ఘర్షణ

- ఇరువర్గాల బాహాబాహీ.. ● పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన
- పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ చర్చలు



చోడవరం పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఇరువర్గాలకు చెందిన యువకులు

చోడవరం, జనవరి 18: పట్టణ శివారు అన్నవరంలో బుధవారం రాత్రి తీర్థమహోత్సవం సందర్భంగా ఇరువర్గాలకు చెందిన యువకుల మధ్య తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. ఇరుపక్షాల వారు బాహాబాహీకి దిగడ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వివాదానికి సంబంధించి ఇరువర్గాలు గురువారం మధ్యాహ్నం మరోసారి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు చర్చలు జరిపి వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. అన్నవరం గ్రామంలో బుధవారం రాత్రి తీర్థం సందర్భంగా ఇరువర్గాలకు చెందిన కొందరు యువకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు తోసుకోవడంతో స్థానికులు విడదీసి పంపించివేశారు. ఇది జరిగిన మరికొంత సేపటికి మరోసారి రెండువర్గాల యువకులు ఘర్షణకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ వివాదంలో ఒక వర్గానికి చెందిన యువకుడికి గాయాలు కావడంతో మరోసారి రెండువర్గాల యువకులు కొట్లాటకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో రాత్రి సద్దుమణిగింది. ఇదిలావుంటే, గురువారం మధ్యాహ్నం మరోసారి రెండు వర్గాల యువకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. తమపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఒకవర్గం ఆందోళను దిగారు. అలాగే, తమపై దాడిచేసి, కులం పేరుతో అవమానించిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ రెండోవర్గం కూడా నినాదాలు చేయడంతో స్టేషన్ వద్ద పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ అప్పలనాయుడు తదితరులు ఇరుపక్షాల వారిని స్టేషన్‌లోనికి పిలిచి చర్చలు జరుపుతున్నారు. అనవసరంగా వివాదాలకు దిగకుండా వ్యవహరించాలంటూ నచ్చచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం రాత్రి వరకూ పోలీస్ స్టేషన్‌లో ఇరుపక్షాల పెద్దలతో పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన బొబ్బిలి దేముళ్లు

దేవరాపల్లి, జనవరి 18: మండల కేంద్రం దేవరాపల్లిలో గురువారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. దేవరాపల్లికి చెందిన వెత్సా రమేష్ ఇక్కడి పెట్రోల్ బంకు నుంచి మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా, గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అతని కాలుకు తీవ్ర గాయం కావడంతో విశాఖపట్నంలోని ఆస్పత్రికి తరలించారు. అలాగే, రైవాడ నుంచి పెట్రోల్ బంకుకు వెళుతున్న బొబ్బిలి దేముళ్లను దొగ్గ దేమున్నాయుడు ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108లో కె.కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దేముళ్లు భార్య దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలావుంటే, వాలాబు వాటర్ ఫాల్స్‌కు యువకులు అతి వేగంగా వాహనాలతో వెళుతుండడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పోలీసులు కట్టడికి చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


ఉమామహేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

కశింకోట, జనవరి 18: మండల కేంద్రంలోని గోవింద కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. అనకాపల్లిలోని ఒక మాల్‌లో పనిచేస్తున్న సూరిశెట్టి మహేశ్వరరావు ఈనెల 17న ఉదయం 9 గంటలకు బయలుదేరివెళ్లి తిరిగి రాకపోవడంతో అతని అన్నయ్య ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోడి పందాలు, పేకాట ఆడుతున్న 9 మందిపై కేసులు

సబ్బవరం, జనవరి 18: మండలంలోని గుల్లేపల్లి, మొగలిపురం, అమృతపురం గ్రామాల్లో పేకాట, కోడి పందాలు ఆడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి, రూ.3,550 నగదు, 4 కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. అమృతపురంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుల్లేపల్లి, మొగలిపురంల్లో కోడి పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.750 నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం

సింహాచలం, జనవరి 18: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత సేవలను గురువారం నుంచి పునఃప్రారంభించారు. గత నెలలో అధ్యయనోత్సవాలు పురస్కరించుకుని అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఉత్సవాలు పూర్తి కావడంతో సేవలను పునరుద్ధరించారు. ఈ మేరకు వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభ య దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అమ్మో.. పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్

- రాంగ్ రూట్‌లపై దృష్టి సారించని పోలీసులు
- ఈ జంక్షన్‌లో కానరాని విద్యుత్ లైట్లు


పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనాలు


పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద కానరాని విద్యుత్ లైట్లు

ఎలమంచిలి, జనవరి 18: పోతిరెడ్డిపాలెం హైవే జంక్షన్ పేరు చెబితే చాలు ప్రజల హడలిపోతారు. ఈ జంక్షన్ యాక్సిడెంట్ పాయింట్‌గా పేరొందింది. మండలంలోని పోతిరెడ్డిపాలెం జంక్షన్‌లో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలు ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ జంక్షన్‌లో పగలు మాటెలా ఉన్నా.. రాత్రి అయితే కటిక చీకటి అలుముకుంటుంది. చీకటిలో పాదచారులు గ్రామంలోకి వెళ్లేందుకు హైవే రోడ్డును క్రాస్ చేస్తున్న సమయంలో అమిత వేగంతో వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనెల 8వ తేదీ రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కారు ప్రమాదానికి గురై భార్యాభర్తలు మృతి చెందిన సంగతి తెలిసిందే. అంతకుముందు మరో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఇక్కడ ప్రమాదాల బారిన పడి స్వల్ప గాయాలతో బయటపడిన పలు సంఘటనలు చాలా ఉన్నాయి. దీనికి తోడు హైవేపై పలు జంక్షన్ల వద్ద ఎక్కువగా వాహనదారులు రాంగ్ రూట్‌లలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాంగ్ రూట్‌లలో ద్విచక్ర వాహనదారులే కాకుండా పెద్ద వాహనాలు కూడా వస్తున్నాయి. మర్రిబంద, రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం, పులపర్తి జంక్షన్‌ల వద్ద రాంగ్‌రూట్‌లలో ప్రయాణిస్తున్న వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయనే విమర్శలున్నాయి. హైవేపై రౌండ్‌ది క్లాక్ విధులు నిర్వహించే పెట్రోలింగ్ గానీ, స్థానిక పోలీసులు కానీ రాంగ్‌రూట్‌లలో ప్రయాణించే వారిపై చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. హైవే జంక్షన్‌లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని పోతిరెడ్డిపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

తెలుగు ప్రజల ఆరాధ్యుడు ఎన్టీఆర్

- వర్ధంతి సభలో కీర్తించిన మాజీ మంత్రి అయ్యన్న
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనుడు జగన్


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, జనవరి 18 : తెలుగు ప్రజల ఆరాధ్యుడు నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని వేములపూడి ఎంపీటీసీ బోళెం రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పరగూడెంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అయ్యన్న మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు మద్యం షాపులు ఎత్తివేస్తామని చెప్పిన జగన్.. నేడు అదే షాపులపై వచ్చే ఆదాయంతోనే రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. పంచాయతీల్లో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసి గ్రామాల అభివృద్ధికి అడ్డంకులు సృష్టించారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పాలన చూసిన ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరు

- పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అనిత, చిరంజీవరావు, విజయ్, తదితరులు

కోటవురట్ల, జనవరి 18: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత జోస్యం చెప్పారు. గురువారం మండలంలోని బోడపాలెం శివారు కొత్తూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీరావు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అనిత మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో టీడీపీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలను మార్చడం కాదు ఏకంగా సీఎం జగనే మారిస్తే సరిపోతుందన్నారు. జగన్ అభివృద్ధి చేసి ఉంటే ఎమ్మెల్యేలను ఎందుకు మారుస్తున్నారని ఆమె ప్రశ్నించారు. పందూరు, జల్లూరు వంతెనలు టీడీపీ హయాంలో మంజూరు చేస్తే.. వాటిని పూర్తిచేయకుండా గాలికి వదిలేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకపోవడం శోచనీయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి, మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మరల చంద్రబాబునాయుడుని సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ టీడీపీ నాయకులపై సీఎం జగన్ ఎన్ని కేసులు,పెట్టినా.. అరెస్టు చేసినా.. భయపడేది లేదన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలుగుదేశం పార్టీ గెలుపును ఆపలేరన్నారు. కార్యక్రమంలో వేచలపు జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, నక్కపల్లి పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


రైల్వే గేటు సమీపంలోని హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఎలమంచిలి, జనవరి 18: పట్టణంలోని కొక్కిరాపల్లి రైల్వేగేటు సమీపంలోని హోటల్‌లో గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీజ తన సిబ్బందితో కలిసి తినుబండాలను పరిశీలించారు. ఈ హోటల్‌లో ఆహార పదార్థాలు నాణ్యత లేకుండా విక్రయిస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. వినియోగదారులకు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. హోటల్‌లో విక్రయించే పలు శాంపిళ్లను సేకరించి తనిఖీలకు పంపుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో 3 హోటళ్లలో ఆహార పదార్థాల తనిఖీలు నిర్వహించామని, వీటి శాంపిళ్లను సేకరించామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీజ తెలిపారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైసీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు సస్పెన్షన్?

- తమకు సమాచారం లేదంటున్న సదరు కార్పొరేటర్లు

విశాఖపట్నం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు కార్పొరేటర్లను సస్పెండ్ చేసినట్టు ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌పై బహిరంగంగా విమర్శలు చేయడంతో పాటు పార్టీకి రాజీనామా చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌తో సన్నిహితంగా ఉంటున్న కొంతమంది కార్పొరేటర్లను తీరు మార్చుకోవాలని పార్టీ నేతలు హెచ్చరించారు. అయినప్పటికీ వాసుపల్లికి టికెట్టు ఇస్తే ఓడిస్తామంటూ పునరుద్ఘాటించడంతో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 35వవ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 37 వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయం సంబంధిత కార్పొరేటర్ల వద్ద ప్రస్తావించగా తమకు ఇంతవరకూఎటువంటి సమాచారం అందలేదని చెప్పడం విశేషం. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన ఉత్తరాంధ్ర నేతల సమన్వయ సమావేశానికి నలుగురు కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వలేదు.

నేటి నుంచి మునిసిపాలిటీలో కుల గణన సర్వే

ఎలమంచిలి, జనవరి 18: మునిసిపాలిటీలో శుక్రవారం నుంచి కుల గణన సర్వే నిర్వహించనున్నట్టు కమిషనర్ కేఏ.కొండలరావు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సర్వే జరుగుతుందరు. కుల గణన సర్వే నిర్వహించే సమయంలో గ్రామంలో లేని కుటుంబాలకు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో సర్వే చేస్తారన్నారు.

రామన్నపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం

కోటవురట్ల, జనవరి 18: మండలంలోని రామన్నపాలెంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏడీ సింహాద్రప్పడు, సర్పంచ్ చినఅప్పన్న ప్రారంభించారు. శిబిరంలో ఎదకు రాని 66పశువులకు, 17 లేగదూడలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టరు హరిప్రియ, ప్రతాప్, బాబురావు పడాల్, శిరీష పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అవగాహన

పాయకరావుపేట, జనవరి 18: మండలంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించడంపై ప్రజాప్రతినిధులకు గురువారం అవగాహన కల్పించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎంపీడీఓ సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ వర్మ, వైవీ.సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించడం, పంచాయతీల నిధులు, వీటిని ఖర్చు చేసే విధానం తదితర అంశాలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచా యతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కేఎస్.గాంధీ పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ బి.సత్యనారాయణ తదితరులు పలు సూచనలు చేశారు. పంచాయతీల అభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు రూపొందించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నరేశ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో...

రాంబిల్లి: పక్కా ప్రణాళికలతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ జి.శిరీష అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులకు గ్రామ పంచాయతీ ప్రణాళికపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. పంచాయతీల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బీవీఎస్ రాజు, కె.శివప్రసాద్ ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్ కొండలరావు పాల్గొన్నారు.

13,994 మంది గృహ లబ్ధిదారులకు వడ్డీ రాయితీ

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


గృహ లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్,జనవరి 18: జిల్లాలోని 13,994 మంది గృహ లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల వడ్డీ రాయితీని ఇవ్వడంతో పాటు మరో 43,904 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35వేలు చొప్పున రూ.కోటి 54 లక్షల 67 వేలు అదనపు రుణ సదుపాయం కల్పించామని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం సీఎం జగన్మోహన్‌రెడ్డి గృహ లబ్ధిదారులకు వర్చువల్ విధానంలో వడ్డీ రాయితీని జమ చేయగా, శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు నమూనా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ రమామణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తితో దాడి కేసులో ఏడుగురు అరెస్టు

- డీఎస్పీ సుబ్బరాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు, పక్కన సీఐ, ఎస్ఐ

బుచ్చెయ్యపేట, జనవరి 18: కోడి కత్తితో దాడి చేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం కోడి పందాల వద్ద వడ్డాది రెల్లి కాలనీకి చెందిన బొర్రా తేజ, స్థానిక ఈబీసీ కాలనీకి చెందిన అదట్రావు శ్రీరామ్‌ల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుందన్నారు. దీంతో ఒకరిపై మరొకరు ఛాలెంజ్‌లు చేసుకున్నట్టు చెప్పారు. సాయంత్రం స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న బొర్రా తేజ, భూపతి రాజులపై శ్రీరామ్, గండెం సాయికుమార్, కొరసాల గణేష్, మాకాల త్రినాథరావు, గండెంప్రసాద్, సుంకర కిరణ్ రాజ్, వెలుగుల సురేంద్రలు తేజపై కత్తి, రాయి, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. భూపతి రాజు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఏడుగురు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. వీరిని చోడవరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- పీటీడీ డిప్యూటీ సీపీఎం సుధాబిందు


సమావేశంలో మాట్లాడుతున్న సుధాబిందు

అనకాపల్లి టౌన్, జనవరి 18: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడపాలని పీటీడీ డిప్యూటీ సీపీఎం సుధాబిందు అన్నారు. స్థానిక పీటీడీ డిపోలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్రైవర్లు డిపో నుంచి బస్సు బయటకు తీసేటప్పుడు కండిషన్‌ను పరిశీలించుకోవాలన్నారు. ఏమైనా అర్జీలు రాసి ఉంటే మెకానిక్‌లు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తానన్నారు. ఇప్పటివరకు జోన్ పరిధిలో 200 మంది కార్మికులు పదవీవిరమణ చేయగా.. 150 మందికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం జరిగిందని, మిగిలిన వారికి అతి త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ ఎస్.సుజాత, సీఐ రవిచంద్ర, ఏఎంఎఫ్ అశ్విని, ఏఎస్ఐ త్రిమూర్తులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ నేషనల్ ఉషూ పోటీలకు క్రీడాకారిణులు పయనం


పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు

నర్సీపట్నం అర్బన్, జనవరి 18 : కోయంబత్తూరులో శుక్రవారం నుంచి జరగనున్న ఖేల్ ఇండియా సౌత్ జోన్ నేషనల్ ఉషూ చాంపియన్ పోటీలకు నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారిణులు పయనమయ్యారు. రాజ రాజేశ్వరి, కె.శార్వాణి, కె.శరణ్య, నివేదిత, బిందుశ్రీ, దివ్య హారిక, అంకితలు సబ్ జూనియర్స్, జూనియర్ విభాగాల్లో తలపడనున్నారని నింజాస్ అకాడమీ బోర్డు డైరెక్టర్ బోళెం శివ తెలిపారు.

ఆక్రమణలను పట్టించుకోని అధికారులపై చర్యలు తప్పవు

- మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, జనవరి 18 : మండలంలో పలు గ్రామాల్లో విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల కబ్జాలకు గురవుతున్నా తహసీల్దార్ సహా సిబ్బంది పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తప్ప రక్షణ లేకుండా పోయిందన్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందువలనే కబ్జాదారులు రెచ్చిపోయి గెడ్డలు, వాగులు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బదిలీపై వెళ్లినా నిర్లక్ష్యం వహించిన అధికారులపై కొత్త ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ప్రశాంతి విద్యార్థి


అనిల్ కుమార్

అచ్యుతాపురం, జనవరి 18: ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు విజయవాడలో జరిగే రిపబ్లిక్ డే క్యాంప్‌కు ప్రశాంతి పాలిటెక్నిక్ ఎన్‌సీసీ కేడెట్ జి.అనిల్ కుమార్ ఎంపికయినట్టు ఎన్‌సీసీ అధికారి మణికంఠ తెలిపారు. ఈ కవాతుకు విశాఖపట్నం గ్రూపు నుంచి పాల్గొంటున్న 12 మందిలో ఈయన ఒకడని తెలిపారు. అనిల్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ అభినందనలు తెలిపారు.



ఈదులపాలెం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

» వైద్య, ఆరోగ్య శాఖకు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక

» ఈదులపాలెం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు షోకాజ్ నోటీసులు

పాడేరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు విధులకు హాజరుకాకపోవడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వున్న వైద్యులు పి.శ్రీను, ఎం.నరసింహాకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్‌బాషాను ఐటీడీఏ పీవో ఆదేశించారు. అనంతరం ఓపీ రిజిస్టరును తనిఖీ చేసి, మందుల నిల్వలపై ఆరా తీశారు. అలాగే పీహెచ్‌సీ పరిధిలో వున్న గర్భిణుల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అలాగే ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగానే ఆస్పత్రిలో చేర్పించి సుఖ ప్రసవం జరిగేలా అవసరమైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు.

22న 300 సెల్ టవర్లు ప్రారంభం

ఏజెన్సీలో ఈ నెల 22వ తేదీన 300 మొబైల్ టవర్లను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. పాడేరు మండలం ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలంలో సీఎం జగన్ వర్చువల్‌గా వాటిని ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా గురువారం పాడేరు మండలం ఈదులపాలెంలోని సభా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఐటీడీఏ పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈఈ పి.అనుదీప్, జియో నెట్‌వర్క్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

» సభ్యులు ఆగ్రహం.. సర్వసభ్య సమావేశం బహిష్కరణ



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెదబయలు, జనవరి 18: సమస్యలను పరిష్కరించని సమావేశాలు ఎందుకని సభ్యులు ధ్వజమెత్తారు. గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు పరిష్కరించేంతవరకు తాము హాజరయ్యేది లేదని ఖరాకండిగా తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు స్పష్టం చేస్తూ ఎంపీడీవో విగ్గిన్స్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశాల్లో ప్రస్తావించిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు, ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులపై ఎటువంటి చర్యలు లేవన్నారు. అలాగే సర్వసభ్య సమావేశాలకు అధికారుల గైర్హాజరైనా చర్యలు చేపట్టడం లేదన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులకు కనీసం ఆహ్వానించడం లేదని, అభివృద్ధి పనులకు గత సమావేశాల్లో చేసిన తీర్మానాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఎంతో నమ్మకంతో తమను గెలిపించారని, వారి సమస్యలను పరిష్కరించకపోతే సమావేశాలకు ఎందుకు హాజరుకావాలని ప్రశ్నించారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించిన తరువాతే సమావేశాల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజు, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు కె.బొంజుబాబు, పలువురు సభ్యుతు పాల్గొన్నారు.

గ్రామాల్లో రామనామ జపం చేయండి



చుట్టుబందలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అక్షితల పంపిణీ దృశ్యం

కొయ్యూరు, జనవరి 18: అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని గ్రామాల్లో శ్రీరామ భజన సంకీర్తన నిర్వహించి రామనామ జపం చేయాలని విశ్వహిందూ పరిషత్ ధర్మ రక్షకులు ఈరే మల్లిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని కినపర్తి పంచాయతీలో గ్రామగ్రామాన విశ్వహిందూ పరిషత్, సర్పంచ్ రీముల శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకుడు దుచ్చరి చిట్టిబాబు తదితరుల ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ శ్రీరామ పవిత్ర పూజిత అక్షితలు వినియోగించే తీరును వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు కాకురు వీర్రాజు, పూజారులు, వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసర సరకుల పంపిణీ



అనాథ పిల్లలకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జనవరి 18: మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ సిరిలిమెట్ట గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ అన్నాచెల్లెళ్లకు జర్రెల సర్పంచ్ బి.భాగ్యవతి గురువారం దుస్తులు, నిత్యావసర సరకులను అందించారు. తల్లిదండ్రులు దూరం కావడంతో ముగ్గురు అనాథులుగా మారారనే విషయం తెలుసుకున్న ఆమె గ్రామాన్ని సందర్శించి బాధిత పిల్లలతో మాట్లాడారు. అధైరపడొద్దని, తనకు చేతనైన సాయం అందిస్తానని ఆమె భరోసా ఇచ్చారు. అలాగే అనాథ పిల్లల విషాదగాథను తన దృష్టికి తీసుకువచ్చిన బూసిపుట్టు ప్రాంతానికి చెందిన యూట్యూబర్ సాధురంతో పాటు తిరుపతి అనే యువకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కుమడ సర్పంచ్ ముక్తమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, భాగ్యవతి సేవా సంఘం ప్రతినిధులు బి.పూర్ణ, కాంతారు మోహన్, పూర్ణమ్మ, సింహాద్రి, కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఘనత ఎన్టీఆర్‌దే

టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

మన్యంలో వాడవాడలా ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

గ్రామాల్లో పార్టీ శ్రేణుల సేవా కార్యక్రమాలు

పాడేరు రూరల్/కొయ్యూరు/అరకులోయ/జి.మాడుగుల/డుంబ్రిగుడ/చింతపల్లి, జనవరి 18: నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి చెప్పారు. గురువారం మన్యంలో వాడవాడలా ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలోని రోగులకు టీడీపీ నాయకులతో కలిసి గిడ్డి ఈశ్వరి పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న లక్ష్యంతో కిలో బియ్యం రూ.2, జనతా వస్త్రాలు, పక్కా గృహాల నిర్మాణం వంటి కార్యక్రమాలను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఎన్టీఆర్, భౌతికంగా దూరమైనా తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, రా.. కదలారా.. నియోజకవర్గ పరిశీలకులు ఎర్ర వేణుగోపాల్‌నాయుడు, మాజీ మంత్రి ఎం.మణికుమారి మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవా కార్యక్రమాలు, అతని ఘనతను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.సింహాచలం, డి.వెంకటరమణ, కేవీ.సురేష్‌కుమార్, జి.శివకుమార్, బి.జ్యోతికిరణ్, డీవీ.కుమారి, సుబ్బారావు, కాంతమ్మ, విజయరాణి, రామునాయుడు, అశ్విన్, మూర్తి, కోటి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అనిశెట్టి చిరంజీవి, నాయకులు బఖీర్‌ఖాన్, దుచ్చరి చిట్టిబాబు తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 200 మంది వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమాలో పార్టీ నేతలు మాకాడ బాలరాజు, కురుజు శ్రీను, వుండా నాగేశ్వరావు, ఎల్.భీమరాజు, ఎం.చిన్న, కె.చంద్రరావు, బాస్కరరావు, ఉబ్బల రాజేష్ జేవి రమణ, సింహాచలం, జె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అరకులోయలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఈ సందర్భంగా దొన్నుదొర పేర్కొన్నారు. జి.మాడుగులలో పార్టీ మండల కార్యదర్శి కిముడు కల్యాణం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.నాగబ్బాయి, బాలయ్యదొర, ఎల్.రామకృష్ణ, ఎం.నారాయణ రాజు, చిన్న, గంగాధర్, చిట్టిబాబు, నాగేశ్వరరావు, రాజారావు పాల్గొన్నారు. డుంబ్రిగుడలో పార్టీ నియోజకవర్గ పరిశీలికుడు విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి నాగేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు అబ్రహం మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గీత, కమ్మిడి సుబ్బారావు, దన్నేరావు, భాస్కరరావు పాల్గొన్నారు. చింతపల్లిలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నేటి తరం రాజకీయాలకు ఎన్టీఆర్ ఆదర్శనీయులని ఈ సందర్భంగా లక్ష్మణరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శెట్టి నాగేశ్వరావు, సత్యవతి, కృష్ణవేణి, రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగ భూషణం, సోమేశ్, అరడా వీరబాబు, కవడం చితుకులయ్య, దేపూరి వెంగళయ్య, గెమ్మెలి మహేష్, జర్ర కోటి, అంద్రాబు లక్ష్మణ్, రమణ పాల్గొన్నారు.



కొయ్యూరులో నిరుపేదలకు చీరలు అందిస్తున్న ప్రసాద్, నాయకులు



అరకులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దొన్నుదొర, నేతలు

అక్రమాలతో పబ్బం గడిపేసిన వైసీపీ ప్రభుత్వం

అరకు చంద్రబాబు సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలి

రా.. కదలిరా నియోజకవర్గ పరిశీలకుడు వేణుగోపాల్‌నాయుడు

పాడేరు రూరల్, జనవరి 18: ఒక్క ఛాన్స్ అంటూ వేడుకుని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అక్రమాలతో పబ్బం గడిపేసిందని రా.. కదలిరా నియోజకవర్గ పరిశీలకుడు ఎర్ర వేణుగోపాల్‌నాయుడు అన్నారు. గురువారం కుమ్మరిపుట్టులోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి స్వగృహంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో అక్రమాలు, అవినీతి, అణచివేతలే తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. అలాగే అరకులోయలో ఈ నెల 20న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరయ్యే రా.. కదలిరా కార్యక్రమాన్ని నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చిహాజరై విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, నాయకులు చల్లంగి లక్ష్మణరావు, జి.సింహాచలం, సోమెలి చిట్టిబాబు, డప్పోడి వెంకటరమణ, కేవీ సురేష్ కుమార్, గంగపూజారి శివకుమార్, బుద్ద జ్యోతికిరణ్, కూడి రామునాయుడు, తోకల ఈశ్వరరావు, డీవీ.కుమారి, ఐదు మండలాల అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్, బూత్ కమిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌నాయుడు

రా.. కదిలిరా సభను జయప్రదం చేయాలి

జి.మాడుగుల: అరకులో నిర్వహించనున్న రా.. కదిలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని 17 పంచాయతీల్లో అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ సభకు తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు, నాయకులు కల్యాణం, ఎల్.రామకృష్ణ, భీంబాబు, బాలయ్యదొర, కుమారి, కొండబాబు, పిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

ఐసీడీఎస్ కార్యాలయాలను ముట్టడించిన కార్యకర్తలు, సహాయకులు » షోకాజు నోటీసుల పేరుతో వేధింపులకు వ్యతిరేకంగా నినాదాలు





ముంచంగిపుట్టు: ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో షోకాజు నోటీసులతో నినాదాలు.. జి.మాడుగులలో షోకాజు నోటీసులు చూపుతున్న అంగన్‌వాడీలు

చింతపల్లి/కొయ్యూరు/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/జి.మాడుగుల/పెదబయలు, జనవరి 18: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మన్యంలో కొనసాగుతోంది. సమ్మె భాగంగా గురువారం ఐసీడీఎస్ కార్యాలయాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ముట్టడించారు. షోకాజు నోటీసులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. చింతపల్లి శిబిరంలో జీతాలు పెంచేవరకు ఆందోళనలు విరమించేదిలేదని యూనియన్ మండల అధ్యక్షురాలు పాంగి పెంటమ్మ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాములమ్మ, నాయకులు అక్కమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, నీలమ్మ, కుమారి పాల్గొన్నారు. కొయ్యూరు శిబిరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ మాట్లాడుతూ నెలన్నర రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం సీఎం జగన్ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, మూడు నెలలో అధికారం చేపట్టనున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అంగన్‌వాడీలకు అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బఖీర్‌ఖాన్, దుచ్చరి చిట్టిబాబు, అనిశెట్టి చిరంజీవి, కురుజు శ్రీను, వుండా నాగేశ్వరరావు, ఎల్.భీమరాజు, మాకాడ బాలరాజు, మేడిబోయిన చిన్న, కాకురు చంద్రరావు, బాస్కరరావు, ఉబ్బల రాజేష్, జేవీ రమణ, సూరిబాబు, ముత్యాలమ్మ, దేముడమ్మ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు ఐసీడీఎస్ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. షోకాజ్ నోటీసులను చేతపట్టి ఎందుకు ఇచ్చారో అధికారులే సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.త్రినాథ్ మాట్లాడుతూ షోకాజు నోటీసులను జారీ చేసి అంగన్‌వాడీలను భయాందోళనకు గురిచేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం సమయంలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం, సీఐటీయూ, అంగన్‌వాడీ సంఘాల నాయకులు ఎం.ఎం.శ్రీను, బి.సత్యవతి, మౌలమ్మ, సుజాత, యశోదమ్మ, ఈశ్వరమ్మ, భవానీ, కాంతమ్మ, కుమారి, చిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. అలాగే సీడీపీవోకు సంజాయిషీ ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ మాట్లాడుతూ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తే ప్రభుత్వం ఎస్మాతో పాటు షోకాజు జారీ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శులు సత్యావతి, పవిత్ర, నాయకులు మల్లమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల అంగన్‌వాడీల సమ్మె, నిరసనలు కొనసాగుతున్నాయి. శాంతియుతంగా దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం వైఖరి మారడం లేదని ఈ సందర్భంగా సంఘం నాయకులు మోదకొండమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్మాను రద్దు చేయాలని, షోకాజు నోటీసులు వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంతమ్మ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, వరహాలమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో యూనియన్ నాయకుకురాలు టి.రాజమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా నోటీసులు జారీ చేసిన వెనక్కి తగ్గేదేలే అని స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీల వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్మా నోటీసులు చేతపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శాంతి, కొండమ్మ, పద్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరు సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

'దళితులపై దాడులు దారుణం'

బుచ్చెయ్యపేట, జనవరి 18: కోడి కత్తితో చేసిన దాడిలో గాయపడిన బొర్రా తేజ కుటుంబానికి రక్షణ కల్పించాలని కులవివక్షత పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరెల్లి చిరంజీవి పోలీసు అధికారులను కోరారు. గురువారం ఆయన వడ్డాదిలో తేజ కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పినపాత్రుని సాంబశివరావు, బూసి కోటి పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి టౌన్, జనవరి 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య హక్కు చట్టం 27/2023ను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల అన్ని వర్గాల వారికీ నష్టమేనని ఆరోపించారు. ప్రజల ఆస్తులకు రక్షణ కొరవడుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. న్యాయవాదులు సాయిలక్ష్మణ్, సూరా శ్రీనివాస్, కుమార్, సుంకర శ్రీనివాస్, కనిశెట్టి సురేష్, శరత్, కాత్యాయిని పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

గొప్పలు చెప్పడమే తప్ప వైసీపీ నేతలు చేసిందేమీ లేదు: టీడీపీ నేత విజయ్



బయ్యవరం సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

మాకవరపాలెం, జనవరి 18 : గ్రామాల అభివృద్ధి టీడీపీ హయంలోనే జరిగా యని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో టీడీపీ శ్రేణులతో గురువారం రాత్రి ఏర్పాటైన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. బయ్యవరంలో సిమెంటు రోడ్ల నుంచి అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల వరకూ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మించామన్నారు. ప్రస్తుత వైసీపీ నాయకులు అభివృద్ధి చేయకపోగా గ్లోబుల్ ప్రచారం మాత్రం చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, ఇక్కడ అయ్యన్నపాత్రుడు మంత్రి కావడం తథ్యమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు ఎక్కడైనా జరిగాయా.. అని ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలకు ఎంతో చేస్తున్నామని వైసీపీ నాయకులు గొప్పలు చెపుతున్నా అది కార్యరూపం దాల్చడం లేదన్నారు. సంక్షేమం అంటూ అనేక షరతులు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజయ్ పిలుపునిచ్చారు.

వంతెన పనులు పూర్తిచేయాలి

» కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠం

ముంచంగిపుట్టు, జనవరి 18: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ సమీపంలో మత్స్యగెడ్డ పాయపై నిర్మిస్తున్న వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.నీలకంఠం డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో గురువారం పర్యటించి బిర్రుగూడ, సుత్తిగూడ, ముంతగుమ్మి ప్రాంతాల్లో నిర్మిస్తున్న వంతెనలు, కాజ్‌వేలను పరిశీలించారు. ఆయా పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. అలాగే సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షించాలని, నాణ్యత పాటించేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.సోమేశ్వరరావు, మండల నేత మానవ్ పాల్గొన్నారు.

చలి మంట కాల్చేసింది..

» ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గిరిజనుడి మృతి

ఎటపాక, జనవరి 18: ప్రమాదవశాత్తు చలి మంట అంటుకుని గిరిజనుడు మృతి చెందాడు. ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ, బండారుగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాదకర సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన కుడియం కన్నయ్య (45) రోజు మాదిరిగానే మంచం పక్కన చలిమంట రాజేసి, నిద్రిస్తుండగా కప్పుకున్న దుప్పటి ప్రమాదవశాత్తు చలిమంటపై పడి కన్నయ్యకు నిప్పంటుకుంది. కొద్దిసేపటికి తేరుకుని కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున కన్నయ్య మృతి చెందాడు. ఎస్ఐ కర్రి పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి, జనవరి 18: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధన దిశగా పంచాయతీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో పి.ఆశాజ్యోతి సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై గురువారం సర్పంచ్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని జనరల్ ఫండ్, ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసేందుకు అవసరమైన విధి విధానాలపై సర్పంచులు, కార్యదర్శులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. జనరల్ ఫండ్‌లో 40-60 శాతం పారిశుధ్యం మెరుగు కోసం ఖర్చు చేయాలన్నారు. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం 20-10 శాతం ఖర్చు చేయవచ్చునన్నారు. సమస్యలు గుర్తించడంతో పాటు పరిష్కార మార్గాలను సూచించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రవీంద్రనాథ్, కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు టీడీపీ పరిశీలకుడిగా చిన్నంనాయుడు

చీడికాడ, జనవరి 18 : అరకు నియోజకవర్గం ముంచంగి పుట్టు మండల టీడీపీ అబ్జర్వర్‌గా ఆ పార్టీ చీడికాడ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న పోతల చిన్నంనాయుడును నియమించారు. ఈ మేరకు జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం టీడీపీ ఆధ్వర్యంలో రా..కదలిరా.. అనే కార్యక్రమం అరకులో జరుగుతుందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హాజరు కానున్నారన్నారు. ముంచంగిపుట్టు మండలం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయనున్నట్టు ఆయన వివరించారు.